

దుబ్బ రాజన్న ఆలయంలో..

శంభో శివ శంభో..

● జిల్లాలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు ● భక్తులతో కిటికిటలాడిన ఆలయాలు



కోటిలింగాల గోదావరి వద్ద భక్తుల స్నానాలు

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శివ నామస్మరణతో జగిత్యాల జిల్లా కేంద్రం మారుమోగింది. శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని గుట్ట రాజేశ్వరస్వామి, మడేలేశ్వర, మార్కండేయ, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చైర్ పర్సన్ అడువాల జ్యోతి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేళల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జాగరణ నిర్వహించారు. రాత్రి 12 గంటలకు బిల్వ పత్ర సమర్పణ పూజ ల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించారు. అన్నపూర్ణ చౌరస్తాలో భక్తులకు పవిత్ర గంగా జలాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు కొంద్ర జగన్ ఆధ్వర్యంలో చేపట్టారు.

ధర్మపురి క్షేత్రంలో..

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి, క్షేత్ర సమీపంలో గల శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయాలు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల శివనామ స్మరణల మధ్య ప్రతి ధ్వనించాయి. ఆయా ఆలయాల్లో ఉదయం వేళలో వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, వేదపండితులు జన్మంచి వంశీకృష్ణ ఆధ్వర్యంలో కొరిడె చంద్రశేఖర్, గొల్లపెల్లి కృష్ణ, కశొజ్జల రాకేష్, పాలెపు సందీప్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. నేరెళ్ల సాంబ శివ, శ్రీ రాజరాజేశ్వర, దమ్మన్నపేట శ్రీ వీరభద్ర స్వామి, జైనా శ్రీ రామ లింగేశ్వర స్వామి, రాజారం శివాలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు శివ నామ స్మరణ చేస్తూ ఆలయాలకు తరలి వచ్చారు. ధర్మపురి శ్రీ అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి, నేరెళ్ల సాంబ శివ, రాజారం శివాలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి నేతృత్వంలో ఎస్ఐ ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ధర్మపురి శ్రీ అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి, శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పాల్గొన్నారు.

పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో..

వెల్గటూర్: మహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటి లింగాల శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి ఆలయం శుక్రవారం శివనామ స్మరణతో మారుమోగింది. స్వామి వారిని దర్శించుకోవడానికి కోటిలింగాలకు భక్తులు పోటెత్తారు. ఆలయ పూజారులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్‌శర్మల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో పూజలు నిర్వహించారు. గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఎస్సై ఉమా సాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో కాంతారెడ్డి, పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శ్రీ కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

పొలాస పొలస్తేశ్వరస్వామి ఆలయంలో...

జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పౌల స్తేశ్వర స్వామి, సహస్రలింగాల ఆలయాలు శివనామస్మరణతో మారు మోగాయి. శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని భక్తులు భారీగా తరలి వచ్చి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌలస్తేశ్వర స్వామిని ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతిలక్ష్మణ్ దర్శించుకున్నారు.



పెగడపల్లి రాజన్న ఆలయంలో..

పెగడపల్లి: పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు వెంగళాయిపేటలోని రాజన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీపీ గోళి శోభాసురేందర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం మహా శివరాత్రి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట గ్రామంలోని రాజరాజేశ్వర నాగాలయంలో భక్తులు పోటెత్తారు. కొత్తపేట ఆలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి, డీఎస్పీ రఘు చందర్, సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాయికల్, ఇటిక్యాల గ్రామాల్లోని శివాలయాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. రాయికల్ చెన్నకేశవనాథ ఆలయం, కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయంలో శివ పార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొత్తపేట నాగాలయంలో శివపార్వతుల కల్యాణానికి ప్రభుత్వపరంగా డిప్యూటీ తహసీల్దార్ గణేష్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

బీర్‌పూర్ మండలంలో..

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్, బీర్‌పూర్ గ్రామాల్లో గల శివలయాలల్లో శివరాత్రి సందర్భంగా శుక్రవారం శివ పార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంతోష్ కుమార్, మధు కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

కొడిమ్యాలలో..

కొడిమ్యాల: కొడిమ్యాల గుండ్రప్ప శివాలయం, మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో హిమ్మతురావుపేట, రామకిష్టాపూర్ రోడ్డుకు సమీపంలో గల శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు అర్చకులు శ్రీనివాస్, రమేష్ చేశారు. ఈ కార్యక్రమాలలో జడ్పీటీసీ ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్య క్షుడు కృష్ణారావు, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, కొడిమ్యాల ఎంపీటీసీ లక్ష్మన్, నాయకులు తిర్మలేష్, శ్రీనివాస్, సతీష్, సుగుణాకర్‌రావు, దేవయ్య, శేఖర్‌రావు, ఆనంద్, ప్రమోద్‌రావు, నారాయణరావు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

దుబ్బ రాజన్న క్షేత్రంలో ...

సారంగాపూర్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బరాజన్న క్షేత్రం శివనామ స్మరణలతో మార్మోగింది. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కోనేటిలో స్నానాలు ఆచరించి క్యూలైన్‌లో లైన్‌లో నిలబడి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, డీసీఎంస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు దర్శించుకున్నారు.

కోరుట్లలో...

కోరుట్ల: పట్టణంలోని కోటినవదుర్గ, మహదేవ స్వామి, నగేశ్వర స్వామి, నందీశ్వర దేవాలయాలు భక్తులతో కిటకిటాలాడాయి. అయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహదేవస్వామి, నగేశ్వర స్వామి దేవాలయాలల్లో శివ పార్వతులకు కల్యాణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మహాదేవ స్వామి దేవాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని జాతీయ రహదారిని అనుకుని వేములవాడ ముఖ ద్వారం నందిశ్వరుడి వద్ద కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్ ఆడెపు కమల - మధులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కోరుట్ల మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య- అనిల్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్ ప్రకాశం రోడ్డులోని అభయ అంజనేయ స్వామి దేవాలయంలో కాలనీవాసులతో కలిసి పాల్గొన్నారు.

కోరుట్లరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో జాతర ఘనంగా నిర్వహించారు. యూసూఫ్‌నగర్, కల్లూరు, మాదాపూర్‌లలోని శివాలయాలలో శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య-రాజేష్ రైతు సమన్వ య జిల్లా మాజీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ చీటి స్వరూప-వెంకటరావు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో...

మెట్‌పల్లి: మెట్‌పల్లి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి, వైష్ణవి దంపతులతో వైభవంగా జరిపించారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలిలు, ఆరపేటలోని ఆలయంలో శివపార్వతులు కల్యాణం నిర్వహించారు. ఓంకారేశ్వర ఆలయంలో ఆర్యవైశ్య నాయకులు మైలారపు లింబాద్రి, రాంబాబులు పాల్గొని స్వామి పూజలు జరిపారు. నాంపల్లి సింహాద్రి, దురుశెట్టి నగరాజ్ నాంపల్లి సంజీవ్, గిరిధర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: ఆత్మకూర్ గ్రామంలోని మార్కండేయ ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహకులు పురోహితుల మంత్రత్సోవాల మధ్య వైభవంగా జరిపించారు. మండలంలోని శివాల యాలు భక్తులతో కిక్కిరిసాయి.

మల్యాలలో..

మల్యాల: మహాశివరాత్రి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. మల్యాలలోని శివాలయం, మార్కండేయ ఆలయం, కొండగట్టు వద్ద గల మం జునాథ ఆలయంలో శివరాత్రి పురస్కరించుకొని భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మల్లాపూర్, మొగిలిపేట, వేంపల్లివెంకట్రావుపేట, వాల్గొండ గ్రామాల్లోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపారు. శనివారం అర్ధరాత్రి మల్లాపూర్ లోని సోమేశ్వర కొండపై స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌లు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధుర్, తిమ్మాపూర్, వేములకుర్తి, బర్తీపూర్, మూలరాంపూర్, ఎర్దండి కోమటికంఒండపూర్, తదితర గ్రా మాల్లోని శివాలయాలు శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివనామస్మరణతో మారుమోగాయి. యామపూర్‌లో శివాల యంలో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ జాజల భీమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి మండలంలో..

జగిత్యాల: మండలంలోని రాపల్లె శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, లొత్తునూర్, శ్రీరాముల పల్లె, లక్ష్మీపూర్, రంగదాముని పల్లె, చిల్వాకోడూర్, ఆత్మకూర్, చెందోళి, మండల కేంద్రంలోని శివాలయాల్లో మహాశివరాత్రి జాతర ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. రాపల్లె, లక్ష్మీపూర్ ఆలయాలను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు.

● గొల్లపల్లి మండలంలోని దట్నూర్ రెవెన్యూ పరిధిలోని రాయేషుని బోరుకు ఇటీవల బయల్పడిన పురాతన శివలింగం విగ్రహానికి మహాశివరాత్రి పర్వదినంను పురస్కరించుకుని గ్రామస్థులు పూజలు చేశారు.

కథలాపూర్ మండలంలో..

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, సిరికొండ, కలికోట, చిందకుంట, దూలుర్ గ్రామాలలోని శివలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రి పర్వదినం మరుసరి రోజు శనివారం పోతారం గ్రామ లోంక రామ్మన్న ఆలయంలో జాతర నిర్వహించనున్నారు.

మేడిపల్లి మండలంలో..

మేడిపల్లి: మహాశివరాత్రి పురస్కరించుకొని గ్రామాల్లో శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. తొంబర్రావుపేట గ్రామంలో కొలువైన పాలరాతి శివుడిని పలువురు ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ధర్మారెడ్డి, తిరుపతి రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆరపేటలోని స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూ



జగిత్యాలలో కౌన్సిలర్లతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్



జగిత్యాల సహస్రలింగాల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పెగడపల్లిలో బారులు తీరిన భక్తులు



పొలస్తేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి పూజలు



ధర్మపురి అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విప్, ఎమ్మెల్యే అడ్లూరి పూజలు



కోటిలింగాలలో మాజీ మంత్రి కొప్పుల దంపతులకు సన్మానం



కోరుట్లలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



కొడిమ్యాలలో భక్తుల పూజలు



ఇబ్రహీంపట్నంలో..



జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ఆత్మకూర్‌లోని ఆలయంలో



వేంపల్లిలోని స్వామి దర్శనానికి భక్తుల క్యూ



కొత్తపేట నాగాలయంలో పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న డిప్యూటీ తహసీల్దార్ దంపతులు



ధర్మపురిలో శివకల్యాణం



ధర్మపురిలో హాజరైన భక్తులు

డెంగ్యూతో ఒకరి మృతి


రాములు(ఫైల్)

కోనరావుపేట, మార్చి 8: రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారంగ్రామానికి చెందిన పిట్టల రాములు (55) అనే వ్యక్తి డెంగ్యూతో శుక్రవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాములు రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో చూపించగా రక్తకణాలు తగ్గాయని, డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని కుటుంబసభ్యులకు సూచించా రు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య రేణుక, కూతురు రమ్య, కుమారులు శ్రీకాంత్, ప్రశాత్‌లుఉన్నారు.

కుక్కల దాడిలో మేకల మృతి

కోనరావుపేట, మార్చి 8: కోనరావుపేట మండలం కొండాపూర్‌లో కుక్కలు దాడి చేసి గొర్రె, మేక పిల్లలను చంపివేశాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన బెదిరే రాములుకు చెందిన మేక, గొర్రె పిల్లలను ఇంటి వద్దనే కంచే వేసి అందులో ఉంచి మేక, గొర్రెలను మేత కోసం తీసుకవెళ్లాడు. శుక్రవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి నాలుగు గొర్రెలు, 5 మేక పిల్లలను కుక్కలు దాడి చేసి చంపివేశాయి. కుక్కల దాడిలో మృతిచెందిన మేకలను చూసి భోరున విలపిస్తూ రూ లక్ష వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అదుకోవాలని వేడుకుంటున్నారు.

అడవి నుంచి జనంలోకి వచ్చిన దుప్పి


దుప్పిని కాపాడిన గ్రామస్థులు

కోనరావుపేట, మార్చి 8: ఓ చుక్కల దుప్పి దాహార్తిని తీర్చుకోవడం కోసం అడవి నుంచి గ్రామ శివారులోకి వచ్చింది. దుప్పిని చూసిన కుక్కలు వెంట పడి తరమగా కోనరావుపేట గ్రామంలోకి చేరింది. వెంటనే గమనించిన గ్రామస్థులు దుప్పిని పట్టుకోని కుక్కల ను చెదరగొట్టి దాని దాహార్తిని తీర్చి అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 8: ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను ఆదివారం ఉదయం 8 గంటలకు గోదావరిఖని సింగరేణి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ డబ్ల్యూ గణపతి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తికల క్రీడాకారులు పాల్గొనా లన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

కొడిమ్యాల, మార్చి 8: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన సిరిమల్ల దేవయ్య(58)అనే వ్యక్తి మతిస్థిమితం లేక మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామ శివారులో గల బావి పక్కన వేప పుల్లను తెంపటానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివ రాల మేరకు దేవయ్యకు కొంత కాలంగా మతి స్థిమితం సరిగా లేని కారణంగా ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈత రాని కారణంగా కాలు జారి బావిలో పడి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుని భార్య సిరిమల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శంభో శంకర


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ప్రతినిధులు


ఏర్పాట్లను తెలుసుకుంటున్న కలెక్టర్


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

- శివనామ స్మరణతో మార్మోగిన రాజన్న క్షేత్రం
- వేములవాడలో కన్నుల పండువగా మహాశివరాత్రి వేడుకలు
- స్వామివారికి మహాలింగార్చన, మహా న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

వేములవాడ, మార్చి 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆపదమొక్కుల దేవుడు రాజరాజేశ్వరస్వామివారి పుణ్యక్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని తరించారు. ఉదయం నుంచి ఉపవాసం పాటించి రాత్రంతా జాగరణ చేశారు. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రధానమైన మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కోడెమొక్కును చెల్లించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు రాజరాజేశ్వరస్వావి ఎవారికి నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి పప్పు బెల్లాలు పంచిపెట్టారు. రద్దీ అధికంగా ఉండడంతో స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది.

● ఘనంగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి 11-35 గంటలకు లింగోద్భవ సమయంలో ఋత్విజులు, వేదపండితులు, అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సాయంత్రం 6-05 గంటల నుంచి స్వామివారి కల్యాణమండపంలో మహాలింగార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకారంలో అమర్చిన దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలందుకున్న సమయంలో రాజరాజేశ్వర స్వామివారిని లక్షలాది మంది భక్తులు దర్శించుకుని తరించగా, వేలాది మంది భక్తులు జాగరణ పాటించారు. ఆలయ పరిసరాలు, గుడిచెరువు ప్రాంగణంలోని బహిరంగప్రదేశంలో రోజంతా ఉపవాసం ఉండి మట్టితో శివలింగాలు, ప్రమిదలు రూపొందించి దీపాలు వెలిగించారు. నైవేద్యం సమర్పించి, రాత్రంతా మెలకువతో ఉండి స్వామివారిని కొలిచి తరించారు.



భక్తులు స్వామివారికి నిలువెత్తు బంగారం (బెల్లం) పంచిపెట్టారు. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ పరిసరాలు కలియతిరుగుతూ ఉత్సవాల ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, భీమ్యానాయక్, ఆర్డీవో ఎస్ రాజేశ్వర్, ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్, తహసీల్దార్ మహేశ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

● శృంగేరి శారదాపీఠం తరఫున పట్టువస్త్రాల సమర్పణ..

మహాశివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వరస్వామి వారికి శృంగేరి శారదా పీఠం తరఫున పట్టు వస్త్రాలు అందజేశారు. శృంగేరి ఆస్థాన పండితులు వ్యాసోజుల రాధాకృష్ణశర్మ పట్టు వస్త్రాలు తీసుకురాగా, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి అందజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణశర్మకు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.


భక్తులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్


యాత్రికుల వాహనాలు


దర్శనం కోసం వెళ్తున్న శివస్వాములు


ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


వేములవాడలో భక్తుల సందడి


చలువ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు


భక్తులకు పండ్లు అందజేస్తున్న వలంటీర్లు


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు

- భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు
- విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

జగిత్యాల, మార్చి8: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాపల్లె శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి జాతర సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పది ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. పోటీల్లో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన కొట్లపెల్లి సాగర్ ప్రథమ విజేతగా నిలిచి దాతరాపల్లె గ్రామానికి చెందిన కొక్కుల పద్మ-జలేందర్ దంపతులు అందించిన పావు తులం బంగారంను కైవసం చేసుకున్నారు. మండలంలోని తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషమియా రెండో విజేతగా నిలిచి రాపల్లె గ్రామానికి చెందిన దాత ఎక్కుల్‌దేవి పద్మ-మల్లయ్య యాదవ్ అందించిన 10 తులాల వెండిని గెలుచుకోగా, మూడో విజేతగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జాడి కిట్టు నిలవగా దాత ఎడ్ల మల్లారెడ్డి అందించిన 5 తులాల వెండిని గెలుచు కున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతర సందర్భంగా ప్రజలకు ఉత్సాహం, ఉల్లాసం కలిగించేందుకు పోటీలు నిర్వహించామని తెలిపారు. ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు నల్ల శ్యామ్, మారంపల్లి బాబు, కొక్కుల భూమయ్య, గంద్ర సత్యంరావు, ఆలయ కమిటీ చైర్మన్ గంద్ర రామారావు, వైస్ చైర్మన్ సత్తయ్య, మల్లేశం, నాయకులు మారంపల్లి మల్లయ్య, కోలా శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, గంగాధర్, శేఖర్, కోలా రాములు, తదితరులు పాల్గొన్నారు.


రాపల్లెలో ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుంది

- మన లక్ష్యానికి అండగా ఉన్నవారికే మద్దతు - ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

సుభాష్‌నగర్, మార్చి 8: ఎస్సీ వర్గీకరణకు 29 సంవత్సరాలుగా జరుగుతున్న పోరాటం అంతిమ దశకు చేరుకుందని, తమ లక్ష్యాలకు అండగా ఉన్నవారికే మద్దతుగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల కరీంనగర్ పార్లమెంట్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ మినహా దేశంలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను మోసం చేశాయని చెప్పారు. 2004లో వర్గీకరణ విషయాన్ని కొట్టివేయడంలో కాంగ్రెస్ పార్టీతో పాటు కొంత మంది కుట్రలు చేశారని ఆరోపిం చారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ముందడుగు వేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే పార్టీలకు మనం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌తోపాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎం ఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఇంజం వెంకటస్వామి, తుంగ ఆంజనేయులు, దండు అంజ య్య, కనకం అంజిబాబు, ఎలగందుల బిక్షపతి, రుద్రరావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

మల్యాల, మార్చి 8: కొండగట్టు ఆంజనేయస్వామిని శుక్రవారం సిరిసిల్ల జిల్లా వేములవాడ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, బాహుబలి సినిమా డైరెక్టర్ రాజమౌళి తండ్రి, సినీ రచయిత విజయేంద్రప్రసాద్ వేర్వేరు గా దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన అనం తరం ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా సత్కరించారు. ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

రేపు రాష్ట్ర బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 8: జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ జూనియర్స్ బేస్ బాల్ జట్ల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్ల హరిశంకర్, మహ్మద్ యూనిస్ పాషా తెలిపారు. బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ ఎంపిక పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను పంజాబ్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

తాట్లవాయిలో యువకుడి దారుణ హత్య

- దుండగులు బలమైన ఆయుధంతో చంపి.. బావిలో పడేసినట్లు అనుమానం

రాయికల్, ఫిబ్రవరి 8: రాయికల్ మండలంలోని తాట్లవాయిలో శుక్రవారం దారుణం జరిగింది. గ్రామానికి చెందిన నాగెల్లి సురేష్(24) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు బలమైన ఆయుధంతో దారుణంగా హతమార్చి వ్యవసాయ బావిలో పడేసి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7న ఉదయం పొలానికి వెళ్తున్నానంటూ ఇంట్లోంచి బయటకు వెళ్లిన సురేష్ శుక్రవారం బావిలో శవమయ్యాడని కుటుంబీకులు రోదిస్తూ తెలిపారు. ఇంట్లోంచి పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన సురేష్ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు శుక్రవారం పొలం వద్ద వెతికారు. బావి సమీపంలో మృతుని ద్విచక్ర వాహనం, చెప్పులు లభించాయి. దీంతో కంగారుపడిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చి బావి చుట్టూ గాలించగా బావి వద్ద రక్తపు మరకలు కనబడటంతో బావిలో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తొలగించగా మృతదేహం లభించింది. గుర్తు తెలియని దుండగులు సురేష్‌ను బలమైన ఆయుధంతో తలపై దాడి చేసి చంపి అతని వ్యవసాయ బావిలోనే పడవేసి ఉంటారని భావిస్తున్నారు. మృతుని తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం కాగా, సురేష్ చిన్నవాడు. బావిలో నుంచి శవాన్ని బయటకు తీయగా మృతుని శరీరంపై చాలా చోట్ల గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. కాగా పూర్తి స్థాయి విచారణ జరిపి హత్య వివరాలు వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంఘటనా స్థలం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్‌లు సందర్శించారు. హత్య వ్యవహారంపై క్షేత్ర స్థాయిలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.


సురేష్(ఫైల్)


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

వీణవంక తహసీల్దార్ సస్పెన్షన్

వీణవంక, మార్చి 8: వీణవంక మండలంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న తిరుమల్‌రావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన రామిడి శివప్రియ అమెరికాలో ఉంటారు. ఆమె పేరుపై ఉన్న 16 గుంటల భూమిని ధరణి ఆపరేటర్ అరుణ్ ముగ్గురు వ్యక్తుల పేరుపై అక్రమంగా పట్టా చేశాడు. ఆ సమయంలో తహసీల్దార్ తిరుమల్‌రావు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ధరణి ఆపరేటర్ అరుణ్ తహసీల్దార్ డిజిటల్ కీని ఉపయోగించి ఈ అక్రమ పట్టా చేశాడు. ఈ విషయం తెలుసుకున్న తిరుమల్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆమె విచారణ జరిపించి విదేశాల్లో ఉన్న మహిళకు సంబంధించి భూమిని ఇతరులకు పట్టా చేసేటప్పుడు కనీస నిబంధనలు పాటించలేదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు తహసీల్దార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

నేటి నుంచి మెడికల్ రిప్రజంటేటివ్స్ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 8: తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజుభట్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం అన్ని రకాల మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తొలగించాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేదించాలని, అన్నారు. ప్రభుత్వం ఫార్మ, వ్యాక్సిన్ సంస్థలను పునరుద్ధరించాలని, ఫార్మ రంగంలో అనైతిక కార్యక్రమాలను అరికట్టాలని, యూసీపీఎంపీ కోడ్‌ను అమలు చేయాలని వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ కోసం ఏర్పాటు చేయబడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ని పరిరక్షించాలని, అన్ని ఫార్మా కంపెనీలు ఫారం ఏ లో అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తమకు పని విధానాలను రూపొందించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి వెంకటేశ్, జాతీయ సహాయ ప్రధాన కార్యదర్శి కె సునీల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ భానుకిరణ్, ఉపాధ్యక్షుడు జి విద్యాసాగర్, సహాయ ప్రధాన కార్యదర్శి, జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎ నాగేశ్వర్‌రావు, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు కె ఐల య్య, సిహెచ్ శ్రీదర్, ఎ సదానందచారి, సయ్యద్ సిద్దిఖీ, ముకుంద్‌కులకర్ణి, పి ము రళి, పీవీఎస్‌పి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గుండా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, అంజయ్య, ఉపాధ్యక్షుడు పి నరేందర్, శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శులు కె సంపత్‌రెడ్డి, కె రమేశ్, కోశాధికారి కె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీకి నందెల్లి మహిపాల్

కరీంనగర్ క్రైం, మార్చి 8: భూకబ్జాకు సంబంధించిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మహిపాల్‌పై నమోదైన కేసులో మరింత లోతుగా విచారణ జరిపేందుకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా 24 గంటల పోలీసు కస్టడీకి అనుమతించింది. దీంతో ఉదయం 11 గంటలకు మహిపాల్‌ను కస్టడీకి తీసుకుని కరీంనగర్ రూరల్ ఠాణాకు తరలించి విచారణ జరుపుతున్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని జీనియస్ చదరంగ అకాడమీలో ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలను నిర్వహించనున్నామని జీనియస్ చదరంగ అకాడమీ కోచ్ కంకటి అనిల్‌కుమార్ తెలిపారు. ముగ్గురు విజేతలకు రూ.5వేల చొప్పున నగదు బహుమతి, పది మందికి ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం ఆలోచన యోచిస్తోంది. తొలుత అంగన్ వాడీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమవుతోంది. కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, సిబ్బంది చేతివాటంతో అంగన్‌వాడీ గుడ్లు, పాలు, పప్పు, వంటివి బహిరంగ మార్కెట్‌లో దర్శనమిస్తున్న ఘటనలు పలు సందర్భాల్లో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. పలు ప్రాంతాల్లో కేంద్రాలు నామమాత్రంగా నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీల్లో అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. కేంద్రానికి వచ్చిన సరుకులు, విద్యార్థులు హాజరు, అంగన్‌వాడీని పూర్తిగా సీసీ కెమెరాలతో పరిశీలిం చేలా కొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల నమోదు తెలుసుకోవడానికి బయోమెట్రిక్ హాజరుకు అడుగులు వేస్తోంది. త్వరలోనే కెమెరాలు, బయోమెట్రిక్ మిషనరీని ఏర్పాటు చేయనున్నారు.



- ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఆ తర్వాత బయోమెట్రిక్ విధానం
- సమగ్ర సమాచారం సేకరిస్తున్న ఉన్నతాధికారులు
- జిల్లాలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య..

జిల్లాలో 1065 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి, మల్యాలలలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు పనిచేస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఇందులో 1,037 మెయిన్ కేంద్రాలు, 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఇటీవలనే మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 272 కేంద్రాలకు సొంత భవనాలలో, 537 అద్దె భవనాలలో, 256 ఉచితంగా భవనాలలో నిర్వహిస్తున్నారు. ఇందులో 225 కేంద్రాలు ఇంతకు ముందు ప్రాథమిక పాఠశాలలో నిర్వ హిస్తుండగా 58 కేంద్రాలు ప్రాథమిక పాఠశాలలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న సొంత భవనాలలో 138 భవనాలకు మరమ్మతులు అవసరం ఉన్నది. అలాగే 38 అంగన్‌వాడీ కేంద్రాల సొంత భవనాలు అసంపూర్తిగా ఉన్నవి. జిల్లాలో మొత్తం గర్భిణులు, బాలింతలు 12,394 మంది ఉండగా, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 34,748 మంది, 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల పిల్లలు 13,969 మంది చిన్నారుల సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కేంద్రాల సమాచారం సేకరణ...

జిల్లాలోని ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి... అద్దె భవనాల్లో ఎన్ని ఉన్నాయి.. ఎంత మంది టీచర్లు, సిబ్బంది ఉన్నారు... పిల్లలు, గర్భిణులు, బాలింతలు సంఖ్య ఎంత అనే పక్కా సమగ్ర సమాచారాన్ని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ అధి కారులు జిల్లా అధికారుల నుంచి సేకరించారు. మొదటి విడతలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం తీసుకొస్తే ఎదురయ్యే ఇంటర్ నెట్ సమస్యలపై అధ్యయనం చేస్తున్నారు. ముందుగా సీసీ కెమెరాల ఏ ర్పాటుపై రెండు, మూడు రోజుల్లో జిల్లాకు మార్గ దర్శకాలు రావొచ్చని సంబంధిత అధికారులు చెబుతున్నారు. విధులకు రాకపోయినా కింది సిబ్బందితో సెంటర్లను నడిపిస్తూ హాజరు వేసుకునే టీచర్లకు చెక్ పెట్టేందుకు బయోమెట్రిక్ హాజరును తీసుకురానున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనుండడంతో లబ్ధిదారుల హాజరుతో పాటు కేంద్రానికి వచ్చిన సరులకుపై నిఘా ఉంటుంది. లబ్ధిదారులకు పౌష్టికాహారం, చిన్నారులకు ప్రాథమిక విద్య మరింత నాణ్యంగా అందే అవకాశం ఉంటుంది.

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం

బి. వాణిశ్రీ, జిల్లా సంక్షేమ అధికారిణి

జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర స్థాయిలో దీనికి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. ఇందుకు అవసరమైన సమాచారాన్ని రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం అమలును పక్కాగా చేపడుతాము.

ముందుగా సీసీ కెమెరాలు...

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముందుగా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయో మెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. కేంద్రాలకు పిల్లలు రాకపోయినా వచ్చినట్లు హాజరు వేస్తూ అక్కడి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరో పణలు ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి. రోజువారి ఆహారం కూడా వడ్డించడం లేదనే ప్రచారం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంత మంది పిల్లలు వస్తున్నారు. వారికి ఏమి నేర్పుతున్నారు..? బాలింతలు, గర్భిణులు వస్తున్నారా..? వారికి మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా...? లేదా..? అనే విషయాలు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

జీవో నంబరు -3ని తక్షణమే రద్దు చేయాలి

● జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్



హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నా మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నియామకాల్లో మహిళా రిజర్వేషన్లు హరించే జీవో నంబరు 3ను తక్షణమే రద్దు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జీవో నంబరు 3ను రద్దు చేసి, నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలువురు చిరుద్యోగులకు జీతాలు సైతం సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. మహిళల రిజర్వేషన్ల అమలు కొరకు ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో పోరాటం చేస్తామన్నారు.

ఎమ్మెల్సీ కవితకు జడ్పీ చైర్‌పర్సన్ సన్మానం

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ దంపతులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని ఆమె నివాసంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శాలువాతో సత్కరించారు. అదే విధంగా మహా శివరాత్రి పురస్కరించుకొని వేములవాడ రాజరాజేశ్వర స్వామి, సారంగాపూర్ మండలం పెంబెట్ల దుబ్బరాజేశ్వర స్వామి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు.

వెంకటేశ్వస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం పూజలు

కొడిమ్యాల, మార్చి 8 :మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి నాగరాజు రమేష్, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులకు వినియోగదారులు సహకరించాలి

మెట్‌పల్లి, మార్చి8: మెట్‌పల్లి పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతులకు వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ జక్కుల అమరేందర్ అన్నారు. శుక్రవరాం పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్‌కో కార్యాలయంలో మట్లాడుతూ పట్టణంలో నాణ్యమైన విద్యుత్‌ను అందజేయడానికి శనివారం మరమ్మతులను చేపట్టడం జరుగుతుందన్నారు. పట్టణంలోని సెక్షన్ -1 పరిధిలోని పాతబస్టాండ్, వెల్లుల్ల రోడ్, బస్సు డిపో, శాంతినగర్, రెడ్డికాలనీ, సాయికృష్ణ, మహాలక్ష్మి నగర్, బీడీ కాలనీ, పోస్టుఆఫీస్, రేగుంట రోడ్డు, సిరిపూర్, ఇంద్ర నగర్, వేంపేట రోడ్, అంబేద్కర్ నగర్, మఠంవాడ, లైబ్ర రీ, మార్కెట్, చైతన్య నగర్, ఏకలవ్య నగర్, మంచాల శివు డు, సాయిరామ్ కాలనీ, మున్సిపల్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డికి తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జె గంగనర్సయ్యలు వినతిపత్రం అందించారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు అనుసరించి సర్వీస్ రూల్స్ తయారు చేసి జీహెచ్‌ఎంలకు పదోన్నతులు ఇవ్వాల ని కోరారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌లను నియమించాలని విన్నవించారు. 2023-24వ ఆర్థిక సంవత్సరంలో ఎస్ఎంసీ రెండవ ఫేస్ గ్రాంట్స్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జీహెచ్‌ఎంఏ జిల్లా శాఖ నాయకులు నరేందర్, వెంకటేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్సీని కలిసిన వ్యాపారం సంఘం నాయకులు

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని శుక్రవారం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంటాల శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు బట్టు ప్రవీణ్‌లు సన్మానించారు. పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకవచ్చిన శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, కాంగ్రెస్ నాయకులు గిరి వెంకటరమణ, పలువురు వ్యాపార సంఘ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



బోరుబావిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, ఫిబ్రవరి 8: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామాజీపేట గ్రామంలో ఎస్సీ కాలనీ, గంగపుత్ర కాలనీలో బోరు బావిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో సాగు, తాగునీటి వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగిత్యాలలో ఆకట్టుకున్న శివగాన స్వరాభిషేకం

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన శివగాన స్వరాభిషేక కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రముఖ గాయకుడు నక్క రాజు ఆధ్వర్యంలో మహాదృఢ సంకల్ప శివగాన స్వరాభిషేకం 24 గంటల పాటు కొనసాగింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు పలువు రు కార్యక్రమంలో పాల్గొని రాజు పాటలకు గొంతు కలుపుతూ పాటలు పాడి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పెల్లి శ్రీధర్‌రావు, గుండేటి రాజు తదితరులు ఉన్నారు.

వేములవాడకు ప్రత్యేక బస్సు సర్వీసులు

కోరుట్ల, మార్చి 8 : కోరుట్ల ఆర్టీసీ బస్ డిపో నుంచి వేములవాడ పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రత్యేక బస్ సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ విజయ మాధరి శుక్రవారం తెలిపారు. కొత్త బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. కోరుట్ల బస్ డిపో నుండి 20 ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. కోరుట్ల బస్టాండ్ నుంచి కథలాపూర్, రుద్రంగి, చందుర్తి మీదుగా బస్ సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు. వేములవాడ దేవాలయం వద్ద జాగరణ చేసే భక్తుల సౌకర్యార్థం శనివారం వేములవాడ నుంచి కోరుట్లకు ప్రత్యేక బస్సులు ఉన్నాయన్నారు.



వేములవాడకు వెళ్తున్న బస్ వద్ద ఆర్టీసీ సిబ్బంది

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, మార్చి 8 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న గుండ్రప్ప శివాలయం పునర్నిర్మాణానికి శుక్రవారం పలువురు భక్తులు విరాళాలను అందించారు. మండల కేంద్రానికి చెందిన ఏనుగు తిరుపతిరెడ్డి దంపతులు 50వేల రూపాయలు, చెన్న శారద కుటుంబ సభ్యులు 50వేల 116 రూపాయలను, శివదీక్ష స్వాములు 21వేల570 రూపా యలను, కొండాపూర్ అంగన్‌వాడీ టీచర్ గుడి భాగ్యలక్ష్మీ స్మారకార్థం ఆమె భర్త మల్లికార్జున్‌రెడ్డి 5,101 అందించారు.

నేడు ప్రజాహిత యాత్ర

మల్యాల, మార్చి 8: మండలంలో ఆది వారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిర్వహిం చనున్న ప్రజాహిత యాత్రను పార్టీ శ్రేణు లు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు కోరారు. మండ లంలో తాటిపల్లిలో ప్రారంభమయ్యే ఈ యాత్ర తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మల్యాల, పోతారం, మద్దుట్ల మీదుగా గొర్రె గుండం వరకు సాగుతుందని తెలిపారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను అత్యధిక మెజా ర్టీతో గెలిపించి ప్రధాని మోదీకి కానుక ఇద్దామని పిలుపు నిచ్చారు. మండల బీజేపీ అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, గాజుల మల్లేశం తదితరులు ఉన్నారు.

దుబ్బరాజన్న ఆలయం వద్ద భక్తుల ఇబ్బందులు

సారంగాపూర్, మార్చి8: దుబ్బ రాజన్న ఆలయం వద్ద మహా శివరాత్రి సందర్భంగా సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దుబ్బ రాజన్న శైవక్షేత్రం జిల్లాలోనే ప్రముఖమైన దేవాలయం. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఐదు రోజుల పాటు జాతర ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు శుక్రవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏర్పాట్లలో అధికారుల వైఫల్యంతో క్యూలైన్‌లు సరిగాలేక భక్తులు చిన్న పిల్లలతో ఇబ్బందులు పడ్డారు. గుడిలో భక్తులు కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి, ఆర్ఐ క్రిష్ణ అక్కడి చేరుకుని గొడవపడ్డ వారిని బయటకు పంపించారు. తాగునీరు, చలువ పందిళ్ల ఏర్పాటు చేయక భక్తులు ఇబ్బందులు పడ్డారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న మమతరవీందర్

రాయికల్, ఫిబ్రవరి 8: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్ పట్టణంలో మున్సిపల్ కార్మికులను కాంగ్రెస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమతరవీందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

డబుల్ రోడ్డు పనులు పూర్తి అయ్యేదెన్నడో?

● నత్తనడకన మల్యాల- పెగడపల్లి డబుల్ రోడ్డు విస్తరణ ● ప్రమాదకరంగా మారిన రహదారి

మల్యాల,మార్చి 8: మల్యాల- పెగడపల్లి మండల కేంద్రాలను కలిపే రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలల తరబడి డబుల్‌రోడ్డు పనులు జరుగుతుండడంతో రహదారికి ఇరువైపులా కంకర తేలి అధ్వానంగా మారింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రెండు మండల కేంద్రాలను కలిపే ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుండగా కంకరతో రహదారి ప్రమాదకరంగా మారింది. ఏడాది క్రితం ప్రారంభం అయిన ఈ పనులు పెగడపల్లి మండల పరిధి వరకు పూర్తి అయ్యాయి. మల్యాల మండల పరిధిలో తక్కళ్లపల్లి శివారులో నుంచి కంకర పనులు కాగా తారు పనులు సకాలంలో పూర్తికావల్సి ఉంది. ఈ రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేస్తే రెండు మండలాల ప్రజలకే కాకుండా ఇతర ప్రాంతాల వారికి సౌకర్యంగా మారనుంది.

● ప్రమాకరంగా వంతెన..

మల్యాల-పెగడపల్లి మార్గంలో తక్కళ్లపల్లి శివారులో గల ఒర్రెకు గల వంతెన రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దాని దిమ్మెలు కూలిపోయాయి. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినపప్పుడు ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లోతుగా ఉండడంతో ప్రమాదాలు జరిగితే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి

త్వరలోనే పనుల పూర్తి : జగదీశ్వర్ ఏఈ, ఆర్అండ్‌బి

డబుల్‌రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయి. మెటల్ పనులు అయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రావాల్సి ఉండడంతో తాత్కలికంగా పనులు నిలిచాయి. ప్రజలకు, ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండా పనుల సత్వర పూర్తికి చర్యలు తీసుకుంటాం

సీఐని సన్మానించిన అంబేద్కర్ సంఘ నాయకులు

కోరుట్ల రూరల్, మార్చి 8: నూతనంగా కోరుట్ల సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబును ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ నాయకులు సన్మానించి అభినందించారు. శుక్రవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో సీఐ సురేష్ బాబును కలిసి భాతర రాజ్యాంగ ముఖ్యాంశాల పుస్తకంను అందించి పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బలిజ రాజిరెడ్డి, ఉయ్యల శోభన్, భూపల్లి నగేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం

జగిత్యాల,మార్చి8(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆసుపత్రిలో శుక్రవారం ప్రముఖ నేత్ర వైద్యుడు, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలోని 15 మంది నిరుపేదలకు శస్త్ర చికిత్సలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు విజయ్, నాయకులు రమణ, శంకర్ తదితరులు ఉన్నారు.

సుద్దముక్కపై 108 శివలింగాలు

జగిత్యాల, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారుడు, కవి, సైకతశిల్పి గాలిపెల్లి చోళేశ్వర్‌చారి మహాశివ రాత్రి సందర్భంగా సుద్దముక్కపై 108 శివలింగాలను చిత్రీకరించి శుక్రవారం తన ప్రతిభను చాటుకున్నాడు. రెండు ఇంచుల సుద్దముక్కపై శివలింగంను చెక్కి, అదే శివలింగంపై సూక్ష్మ కళారూపంలో 108 శివలింగాలను, ఒక్కో వరుసలో 8 శివలింగాల చొప్పున 14 వరుసల్లో చెక్కారు.



సుద్దముక్కపై చెక్కిన శివలింగాలు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు



ఆత్మనగర్‌లో మహిళ ఉద్యోగులకు సన్మానం

కోరుట్ల, మార్చి 8: కోరుట్ల పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ మహిళా నాయకులను సన్మానించి అభినందించారు. పట్టణంలోని సాయిరాంపుర కాలనీలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందిస్తున్న వాగ్దేవి క్లబ్ సభ్యులను పూలమాలలు శాలువాలతో సత్కరించారు. వాగ్దేవి మహిళ క్లబ్ సభ్యులు సురేఖ, కళ్యాణి, దేవిశ్రీ, సుజాత, రేవతి, సుష్మలను అలయన్స్ క్లబ్ సభ్యులు కటకం రాజేంద్రప్రసాద్, పాటిల్ ధరందీప్ గోనే శ్రీహరి, కటుకం మలికార్జున్, కౌలాస నాగేశ్వర రావు, కటకం సురేందర్, లింగ ఉదయ్, చింతకింది ప్రదీప్, కటకం రాజశేఖర్‌లు సన్మానించి అభినందించారు. అదే విధంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సానిటేషన్ అధికారి గజానంద్ పారిశుద్ధ్య మహిళ కార్మికులను సన్మానించి అభినందించారు.

● మెట్‌పల్లి రూరల్ : మహిళలు నారీ శక్తిగా అన్ని రంగాల్లో విజయం సాధిస్తూ తోటివారికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని మాజీ సర్పంచు జరుపుల శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని శుక్రవారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో వివిధ రంగాల్లో ఉన్న మహిళలకు పంచాయతీ కార్యదర్శి నిజామొద్దిన్, మాజీ ఉపసర్పంచు చిలివేరి విజయ్‌తో కలిసి శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జరుపుల రజిత, మాజీ ఎంపీపీ సీలమ్మ, మహిళ నాయకులు సుమలత, రేఖ, విజయ, స్నేహ, శ్రీలత, నాగమణి, వసంత, హేమ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల రూరల్, మార్చి 8: మండలంలోని అయా సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ నెల 9న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ భూక్య శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. వివిధ సబ్‌స్టేషన్‌లో పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని తెలిపారు. వెంకటాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని చిన్నమెట్‌పల్లి, వెంకటాపూర్, పెద్దాపూర్ సబ్‌స్టేషన్ పరిదిలో రామారావుపల్లి, పెద్దాపూర్ గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఏఈ తెలిపారు.

కొడిమ్యాల: ఈ నెల 9న శనివారం సాయంత్రం 4గంటల నుంచి 6 గంటల వరకు కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిదిలోని కొడిమ్యాల, రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఆర్. రఘునాథ్ తెలిపారు. కొడిమ్యాల సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున సరఫరా నిలిపి వేసున్నట్లు తెలిపారు.

ఆర్ఎంపీ కార్యవర్గం ఎంపిక

కథలాపూర్, మార్చి 8: మండల ఆర్ఎంపీ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. మండల అధ్యక్షుడుగా బత్తిని శ్రీనివాస్, కోశాధికారిగా సురేష్, ప్రదాన కార్యధర్శిగా విజయ్ గౌడ్, సలహాదారులుగా శ్రీనివాస్‌రావు, వ్యాస మహర్షిని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. సంఘ సభ్యులకు కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.